క్లుప్తంగా

ఆశ్రమంలో అన్నదానం

గురజాల: స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురజాల నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి జన్మదినంను పురస్కరించుకుని ముందుగా నగర పంచాయతీ కార్యాలయం నందు కేక్‌ను కట్ చేసి అనంతరం వృద్ధాశ్రమంలో కేక్‌ను కట్ చేశారు. జక్కా రమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో పూజలు



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లిలోని కోదండరామాలయం దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కోదండ రామస్వామి, సీతమ్మలను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కుంకుమపూజతో పాటుగా అభిషేకాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు అందించారు. కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో తనిఖీలు



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికుడి ఫాతిమా బీఈడీ కళాశాలలో శనివారం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉన్నత విద్యామండలి ఉన్నతాధికారుల సూచనలు మేరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నియమించిన త్రిసభ్య కమిటీ బృందం కళాశాలలోని అన్ని సౌకర్యాలను పరిశీలించారు. కళాశాలలోని ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులు, క్రీడా ప్రాంగణాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. కళాశాల కరస్పాండెంట్ యామర్తి సురేష్, ప్రిన్సిపాల్ యాగంటి భగవాన్‌రావు కళాశాలలకు సంబంధించిన రికార్డులు చూపించారు.

ట్రై సైకిల్ అందజేత



మాచర్ల: పట్టణంలో దివ్యాంగుడైన మాచర్ల రాజారత్నంకు సొసైటీ కాలనీలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ట్రై సైకిల్‌ను సేవా సమితి సభ్యులు అందజేశారు. సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా రూ. 9వేల విలువైన ట్రై సైకిల్‌ను అందజేయటం జరిగిందన్నారు. హెచ్ఎం వై.రమాదేవి, జల్లా సురేష్, నరేంద్ర, వేముల వెంకటేష్, నితిన్‌సాయి తదితరులున్నారు.

జడ్జి శారదాదేవి ప్రత్యేక పూజలు



మాచర్ల: వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ శారదాదేవి కుమార్తె పుట్టిన రోజు పురస్కరించుకొని శనివారం స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీకి చెందిన వీరాంజనేయులు, చుండూరు మల్లిఖార్జునరావు, కౌన్సిలర్ గట్ల కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోస్టర్లు ఆవిష్కరణ

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 27న నరసరావుపేటకు రానున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రచారజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడుతూ బస్సుయాత్ర ఈ నెల 27న నరసరావు పేటకు వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు తానం మత్తయ్య, మధుసూదనరావు, తిమ్మరాజు, ప్రజానాట్యమండలి కళాకారులు షేక్ చిన జాన్ సైదా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మదర్‌థెరీసా జీవితం అందరికీ ఆదర్శం



మదర్‌థెరీసా చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



సాగర్‌మాత దేవాలయంలో మదర్ థెరీసా విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న జక్కిరెడ్డి చిన్నపరెడ్డి

రెంటచింతల: ప్రపంచ ప్రజలందరిచేత తల్లిగా కొనియాడబడిన మదర్‌థెరీసా జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం మదర్‌థెరీసా జయంతి సందర్భంగా స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి ఎంపీపీ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మదర్‌థెరీసా ఎందరో కుష్టురోగులను, నిర్భాగ్యులను, అనాథలను అక్కున చేర్చుకుని వారికి సేవచేసిన మహనీయురాలుగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ప్రేమమూర్తిగా ఆమె చేసిన సేవలను గుర్తించి పునీతురాలు(సెయింట్) హోదాను వాటికన్ చర్చి ప్రకటించిందన్నారు. అనంతరం మరనాత వెల్లటూరి సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్‌మాత దేవాలయంలో...

విజయపురిసౌత్: సేవామూర్తి మదర్ థెరిస్సా జయంతి వేడుకలు స్థానిక సాగర్‌మాత దేవాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా సేవా సమితి మాజీ అధ్యక్షుడు జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. తొలుత దేవాలయంలో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాగర్‌మాత ఫాదర్ జోసఫ్ తంబి, ఆర్‌సీఎం పాఠశాల సిస్టర్స్, ఆలయ పెద్దలు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, శౌర్రాజు, మరియదాసు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో...

మాచర్ల: మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా శనివారం ఆమె విగ్రహానికి పట్టణ కమిషనర్ ఈవీ రమణబాబు, సేవా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి శాంతిరెడ్డి, కమిటీ సభ్యులు జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, పాపిరెడ్డి, జోజిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మదర్‌థెరిస్సా విశ్వమాతగా గుర్తింపు పొందారన్నారు. ఆమెను భారత రత్న అవార్డుతో ప్రభుత్వం గుర్తించిందని, ఆమె సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు.మదర్‌థెరిస్సా సమితి సభ్యులు, సెయింటాన్స్ సంస్థల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం



విద్యుత్ కుంకుమ బండ్లను ప్రారంభిస్తున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కుంకుమ బండ్లను వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలను కలిసికట్టుగా నిర్వహించుకోవటం సంతోషకరమన్నారు. గ్రామంలోని వివిధ సామాజిక వర్గాల వారు ఏర్పాటు చేసిన కుంకుమ బండ్లను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించామన్నారు. గ్రామస్తులంతా సంతోషంగా ఉత్సవాలు జరుపుకోవటం ఆనందదాయకమన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెల్లి లక్ష్మారెడ్డి, వెంకట లక్ష్మారెడ్డి, మోదుగుల వెంకటరెడ్డి, నర్రావుల అయ్యన్న, ఈడెబోయిన వెంకయ్య, తంగిరాల శివారెడ్డి, బుజ్జి, పిన్నెల్లి హనిమిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెరిక సత్ర నిర్మాణానికి భూమి పూజ



శ్రీశైలంలో పెరిక అన్నదాన సత్ర నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రభుత్వవిప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వెల్దుర్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీమల్లర సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, చింతా ఆదినారాయణ హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ శ్రీశైలంలో పెరిక సంఘం ఆధ్వర్యంలో సత్రాన్ని నిర్మించుకోవటానికి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం 52 సెంట్ల స్థలాన్ని కేటాయించిందన్నారు. సత్ర నిర్మాణానికి సొంత నిధులను విరాళంగా రూ. 5లక్షలు అందిస్తామన్నారు. ఎంపీపీ చింతా శివరామయ్య, సర్పంచ్‌లు తోట నారాయణ, జూకూరి వెంకట్రామయ్య, చింతా సుబ్బయ్య, తోట బ్రహ్మయ్య, సాని రఘురామయ్య, రాష్ట్ర, జిల్లా పెరిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ. 84వేలు రికవరీ

మాచర్ల రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం, పంచాయితీరాజ్, ఐటీడీఏ శాఖల ద్వారా జరిగిన రూ.11.28కోట్ల పనుల్లో రూ. 84వేలు రికవరీ చేస్తున్నట్లు పల్నాడు జిల్లా డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదికలో ఆయన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు 15 గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో జరిగిన పనులకు ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందం అందించిన వివరాలను వారు పరిశీలించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో 483 వర్కులకు గానూ రూ. 6.54కోట్ల తో పనులు నిర్వహించారు. వీటిలో తప్పులను గుర్తించి రూ. 54581 రికవరీ విధించారు. అలాగే పంచాయితీరాజ్ 64 వర్కులకు రూ. 4.69కోట్లతో పనులు నిర్వహించగా వీటిలో రికార్డుల తయారీలో సిబ్బంది చేసిన నిర్వాకానికి రూ. 30వేలు అపరాధ రుసుము విధించారు. విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ విజయకుమారి, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎస్ఆర్‌పి బుజ్జి, ఏపీఓ నాగశ్రీనివాస్, ఎఫ్ఎలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో భోజనం స్వీకరిస్తున్న కమిషనర్

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించటంతో పాటు ప్రతివిద్యార్థికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామమోహన్ తెలిపారు. పెదచెరువులోని శ్రీజవహర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శనివారం కమిషనర్ రామమోహన్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం క్రింద విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం స్వీకరించారు. గుడ్లు నాణ్యతను పరిశీలించి నాణ్యతలేని వాటిని తిరిగి పంపాలని తెలిపారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు గోరుముద్ద అందుతున్నదీ, లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన తాజా పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందివ్వాలని తెలిపారు. గోరుముద్దలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరగతి గదిలో విద్యాబోధనను పరిశీలించిన కమిషనర్ రామమోహన్ విద్యార్థులను ప్రశ్నించి వారి సామర్థ్యాలను తెలుసు కున్నారు.

పాడి రైతుల సంక్షేమానికి చర్యలు

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న పాలవెల్లువ పురోగతి పెంపుదల, పాల ఉత్పత్తిదారులకు రుణాల మంజూరుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు సోముల గుణధీర్, పాలపర్తి గణేష్ కుమార్, ఏపీయం జి.వాసుబాబు, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, సీసీలు ఖాజావలీ, బేబిరాణి, రమాదేవి, సొసైటీ సీఈవోలు జాలాది నాగప్రసాదు, వెంకట నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, వీవోలు, సచివాలయ ఉద్యోగు లు పాల్గొన్నారు. 12 శాతం ఫ్యాట్,ఎస్ఎన్ఎఫ్ 9శాతం ఉన్న పాలకు ఒక్కో లీటరుకు రూ.88 రూపాయలు ప్రభుత్వ మంజూరు చేస్తుందన్నారు. పాడి రైతులకు ఆన్‌లైన్ విధానంలో మెరుగైన పారదర్శకంగా అందించుతుందన్నారు. నాణ్యత కల్గిన అమూల్ దాణా కట్టల 50 కేజీల సంచి రూ. 1300లకు అందజేస్తుందన్నారు. సొసైటీ బ్యాంకు సారథ్యంలో జిల్లాలో రూ. 50 కోట్లు రుణాలు ఇవ్వటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పాడి రైతులు మరింత అభ్యున్నతికి ప్రభుత్వ పరంగా ఒక్కో రైతుకు రూ. 30 నుంచి ఒక లక్ష 60 వేల వరకు రుణాలు ఇవ్వటానికి రంగం సిద్ధం చేసిందని, 7 శాతం వడ్డీ రేటుకు సొసైటీ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తాయన్నారు.

కుష్ఠు నియంత్రణపై సమీక్ష సమావేశం

నరసరావుపేట: కుష్ఠువ్యాధి మచ్చ రూపంలో ఉన్నప్పుడే నిర్ధారించి చికిత్స తీసుకుంటే పూర్తిగా వ్యాధి నయమవుతుందని, అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చునని జిల్లా లెప్రసీ, క్షయ వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ కె.పద్మావతి వివరించారు. లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పల్నాడు రోడ్డులోని పాత ఏరియా వైద్యశాలలోని జిల్లా కార్యాలయంలో శనివారం నెలవారి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డేటా ప్రొటెక్షన్ అధికారుల పనితీరుని సమీక్షించారు.

అకాడమీ పురస్కారాలకు ఆహ్వానం



పిడుగురాళ్ల: తెలుగు, సంస్కృత అకాడమీ ఈ నెల 29న నిర్వహించనున్న పురస్కారాలకు పిడుగురాళ్ల నుంచి కవి వైహెచ్‌కే మోహన్‌రావుకు ఆహ్వానం పత్రిక అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహితీ విభాగంలో భాషా పురస్కారానికి తన్ను ఎంపిక చేయటం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావును పలువురు కవులు, పుర ప్రముఖులు అభినందించారు.

నూతన ఆలయాల ప్రతిష్టకు ఆహ్వానం

దుర్గి: మండల పరిధిలోని జంగమహేశ్వరపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోలేరమ్మ తల్లి పోతురాజు స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతిష్ట కార్యవర్గ సభ్యులు ఊరుబండి మన్నయ్య మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి వచ్చే నెల 2వ తేదిన శనివారం వరకు వివిధ రకాల పూజలు హోమలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అతిథిగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరుకానునట్లు వివరించారు. సెప్టెంబర్ రెండు శనివారం ప్రతిష్ట కార్యక్రమంతో పాటు మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆలయ గాయకుడు మృతి

దుర్గి: నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో భజన కార్యక్రమంలు కొనసాగిస్తూ భక్తులను తన గానంతో అందరి మన్ననలు పొందుతున్న ప్రముఖ గాయకుడు పోకాల నాయుడు శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వినుకొండ మండల వెంకటరెడ్డి పల్లె గ్రామంలో భజన కార్యక్రమాలు ముగించుకొని స్వగ్రామం శిరిగిరిపాడుకు బయలుదేరారు. త్రిపురాంతకం సమీపంలో తను నడుపుతున్న మినీ వ్యానును ఆర్టీసీ బస్సు ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో మరో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. భజన బృందంలోని మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహ బాబు, మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్టు

పిడుగురాళ్ల: దైవ క్షేత్రంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు. మండలంలోని దైవక్షేత్రమైన గుత్తికొండ బిలంలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారిని ఎస్ఈబీ పిడుగురాళ్ల సీఐ ఎస్.కొండారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 4750లు స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి స్థావరాలపై దాడులు

పిడుగురాళ్ల: పట్టణంలోని స్థావరాలపై పట్టణ పోలీసులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. పట్టణంలోని మారుతీనగర్‌లో ఓ మహిళ గృహంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు విశ్వసనీయ సమాచారం రావటంతో గంజాయి స్థావరాలపై పట్టణ పోలీసులు మెరుపు దాడులునిర్వహించారు. పట్టణంలో ఇటీవల లెనిన్ నగర్, మారుతీ నగర్ ప్రాంతాలలో గంజాయి విక్రయాలు ఉన్నాయని సమాచారం పోలీసులకు రావటంతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణంలో గంజాయిపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అమ్మకందారులకు ఈ గంజాయి ఎక్కడ నుంచి వచ్చింది, ఎవరు సప్లయి చేస్తున్నారో అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నామని తెలిపాు.గంజాయి విక్రయదారులను త్వరలోనే అదుపులోకి తీసుకొని సమగ్ర సమాచారాన్ని వెల్లడిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను రెచ్చగొట్టడం సరికాదు

నారా లోకేష్ అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ పీవీ ఆంజనేయులకు వినతిపత్రం అందజేస్తున్న టౌన్ యూత్ అధ్యక్షుడు మందాసుధీర్



కారెంపూడిలో ఎస్ఐ రామాంజనేయులుకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: ప్రజలను రెచ్చగొట్టేవిధంగా తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రవర్తిస్తున్నారని, అది సరికాదని వైఎస్సార్ సీపీ టౌన్ యూత్ అధ్యక్షుడు మందా సుధీర్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో నారా లోకేష్ అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ కేసులు ఎవరిపైన ఉంటే వారికి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు ఇవ్వటం జరుగుతుందని చెప్పటం సరికాదని ఆయన తెలియజేశారు. ప్రజలకు అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పాలి కానీ, ప్రజలపై దాడులు చేయమని కార్యకర్తలను ప్రోత్సహించటం సరికాదని ఆయన తెలియజేశారు. నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ అరుణ, ఇర్లా శివ, పసుపులేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడులపై ఫిర్యాదు

కారెంపూడి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడులపై కారెంపూడి మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ జక్కిరెడ్డి నాగిరెడ్డి, తదితరులు శనివారం కారెంపూడి ఎస్ఐ ఎం.రామాంజనేయులుకు ఫిర్యాదు చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా అనుచితంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే విధంగా లోకేష్‌తో పాటు చంద్రబాబునాయుడు, అచ్చెంన్నాయుడు ప్రేరేపిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలోని తంబళ్లపల్లి, పుంగనూరు, మాచర్ల వంటి సమస్యాత్మక నియోజకవర్గాలలో కక్షలు రాజేసి గొడవలు సృష్టించే విధంగా వారి ప్రసంగాలు సాగాయని ఉదహరించారు. రానున్న రోజుల్లో ఇలా ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టి రాష్ట్రంలో అశాంతిని సృష్టించే అవకాశాలు కన్పిస్తున్నాయని అలా జరగకుండా రాష్ట్రంలో శాంతి నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

చంద్రబాబు, లోకేష్‌లపై కేసు నమోదు చేయాలి...

దుర్గి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, రాష్ట్ర ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌ల పై కేసు నమోదు చేయాలని శనివారం దుర్గి ఎస్ఐ శివకు మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కుప్పాల శివకేశవ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వినర్లు పసుపులేటి సాయి శంకర్, షేక్ సైదా, ఆర్.అశోక్‌రెడ్డి, బి.ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా ప్రతిష్ట మహోత్సవం



రచ్చమల్లపాడులో బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం సిద్ధాంతి పోతునూరి శివరామచారి ఆధ్వర్యంలో 11 మంది వేదపండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య ఉదయం ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. ఉదయం గణపతి పూజ, పుణ్యాహం, సర్వదేవత ఆవహానహవనములు, పీఠాపూజలు, గర్తనాశ్యము, ధాతున్యాసము, బీజన్యాసము, సుముహూర్త యంత్ర స్థాపనలు జరిగాయి. అనంతరం దృష్టి స్థాపనలు, దేను దర్పణ దర్శనం, మహాకుంభాభిషేకం, బలిహరణలు, పూర్ణాహుతి, శాంతి మంత్రములు, మహదాశీర్వచనములు జరిగాయి. నాభిశిల(బొడ్రాయి) మహాశీతలి, శ్రీగమిడిశిల యంత్రం, శ్రీపోలేరి మాత, శ్రీ పెద్దమ్మతల్లి, శ్రీ పోతురాజుల శిల ప్రతిష్ఠా మహత్స్యము గ్రామస్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులతో గ్రామంలో పండుగ వాతావరణంలా నెలకొంది. గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెల్లి వెంకట లక్ష్మారెడ్డి, పిన్నెల్లి లక్ష్మారెడ్డి, తంగిరాల శివారెడ్డి, బుజ్జి, ఈడెబోయిన వెంకయ్య, నర్రావుల అయ్యన్న, జంగిలి శ్రీనివాసరావు, మోదుగుల వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



జాబ్ మేళాలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ రామచంద్రన్, కుర్రి సాయి మార్కొండారెడ్డి

మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఆయా ప్రాంతాలలో వేలాది మంది నిరుద్యోగులకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తూ ఉపాధి కల్పిస్తోందని పల్నాడు జిల్లా ఫారెస్టు అధికారి రామచంద్రన్ అన్నారు. శనివారం పత్తిఫ్యాక్టరీ చక్రధర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు హాజరై మాట్లాడారు. ఇటువంటి అవకాశాలను ప్రతి నిరుద్యోగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడులో జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనలు మేరకు భారీ జాబ్ మేళా నిర్వహించటం జరిగిందన్నారు. ఈ జాబ్‌మేళాలో ఐసీఎస్ సాధించిన కల్లెం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి సంజీవులు, న్యూటన్స్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం వందలాదిగా హాజరైన యువతకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సంస్థలకు చెందిన వారు ఇంటర్వ్యూలు నిర్వహించగా 156 మందిని ఎంపిక చేశారు. వీరందరికీ నియామక పత్రాలు అందించారు. సీసీలు, ఏపీఎస్ఎస్‌డీ రామాంజనేయులు, రవీందర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 15 కుటుంబాలు చేరిక



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న ఎస్సీ నాయకులు

పిడుగురాళ్లరూరల్: మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన ఎస్సీ నాయకులు నర్సరావుపేటలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతి ఒక్కరు పార్టీలో చేరుతున్నారని ఆయన తెలియజేశారు. గురజాల నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు గతంలో ఎన్నడు ఏ పార్టీ చేయలేదని, దానిని చూసి ఇతర పార్టీలవారు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ఆయన తెలియజేశారు. అనంతరం 15 కుటుంబాల చెందిన వారికి ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ ఇనుముక్కల పాపమ్మ, ఎంపీటీసీ రాంబాబు, పేరయ్య, రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.